# ప్రైవేట్ బడి..అంతులేని దోపిడీ..

- చిన్నపట్టణాలకు విస్తరించిన కార్పొరేట్ బడులు
- టెక్నో, డిజి, ఒలంపియాడ్, సక్సెస్, టాలెంట్ ట్యాగ్ లైన్లతో వెలుస్తున్న స్కూళ్లు
- భారీగా పెరుగుతున్న ఫీజులు
- తల్లిదండ్రులపై భారం
- నియంత్రణలో అధికారుల విఫలం




**శెనార్తి మీడియా, కరీంనగర్ ప్రతినిధి:**

గతంలో పెద్ద పట్టణాలకు మాత్రమే పరిమితమైన కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పుడు పల్లెకు విస్తరిస్తున్నాయి. గతంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి నగరాల్లో మాత్రమే వినిపించే ప్రముఖ పాఠశాలలు ఇప్పుడు కొత్త జిల్లా కేంద్రాలు సహా చిన్న పట్టణాలు, మునిసిపల్ కేంద్రాల్లో పెద్ద మొత్తంలో వెలిశాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పెరిగిన పోటీ కారణంగా గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆయా విద్యాసంస్థలు విస్తరించి ధనార్జనే లక్ష్యంగా ఫీజులు పెంచేసి తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ పేర్లతో పాఠశాలలకు ట్యాగ్ లైన్లు తగిలించి విద్యార్థులు, తల్లితండ్రులను ఆకర్షిస్తున్న ఆయా విద్యాసంస్థలు ఫీజులను రెట్టింపు చేసి వసూలు చేస్తు న్నాయన్న విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అయితే నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవు తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన కార్పోరేట్..?**

మూడేళ్ల క్రితం దాకా కొత్త జిల్లా కేంద్రాల్లో కనిపించని కార్పొరేట్ విద్యాసంస్థలు తాజాగా కొత్త జిల్లా కేంద్రాలతో పాటు చిన్న చిన్న పట్టణాల్లో కూడా ఏర్పాటు చేయడం చూస్తే కార్పొరేట్ విద్యాసంస్థల విస్తరణ ఏ స్థాయిలో జరుగుతున్నదో అర్థం అవుతున్నది. దీని ప్రభావం కారణంగా చిన్నచిన్న పట్టణాలు గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడుతున్నది. దీనికి తోడు కార్పొరేట్ ప్రైవేటు విద్య మోజులో పడుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు ఆర్థికంగా చితికి పోతున్నారు. గత రెండేళ్ల వ్యవధిలో గోదావరిఖని, పెద్దపల్లి లాంటి పట్టణాల్లో పదుల సంఖ్యలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం చూస్తే విస్తరణ ఏ స్థాయిలో జరిగిందో అర్థం అవుతున్నది. మంథని, సుల్తానాబాద్ లాంటి చిన్న మున్సిపాలిటీల్లోనూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటవుతున్నాయి.

**భారీగా పెరిగిన ఫీజులు**

కార్పొరేట్ పాఠశాలల ఏర్పాటు కారణంగా గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులపై ఫీజుల భారం రెట్టింపు అయింది . అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి గతంలో స్థానికంగా ఉండే ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి దాకా విద్యార్థులకు తరగతులను బట్టి ఏడాదికి 5000 నుంచి 20వేల దాకా ఫీజులు ఉండేవి. కాస్త మంచి పాఠశాలగా పేరు ఉంటే అత్యధికంగా 30 వేల దాకా ఫీజులు వినిపించేవి. కానీ తాజాగా కార్పొరేట్ పాఠశాలలు విస్తరించడంతో తరగతులను బట్టి ఫీజులు ఏడాదికి 20వేల నుంచి 80 వేల దాకా పెంచేశారు. కొన్ని పేరు ఉన్న పాఠశాలలు తొమ్మిది, పది తరగతులకు ఫీజులు లక్ష దాకా వసూలు చేస్తున్న సమాచారం ఉంది. దీన్నిబట్టి తల్లిదండ్రులపై భారం ఏ స్థాయిలో పడుతున్నదో అర్థం అవుతున్నది. విద్యార్థులు ఒకరిని చూసి ఒకరు అన్నట్లు... పాఠశాలలకు పెట్టిన అందమైన ట్యాగ్ లైన్లకు ఆకర్షితులై కార్పొరేట్ పాఠశాలల్లో చేరుతామని తల్లిదం డ్రులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో కాదనలేక తల్లిదం డ్రులు ఆర్థికంగా భారం అయినప్పటికీ కార్పొరేట్ పాఠశా లల్లో చేరుస్తున్నారు. ఫీజులను నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం విఫలం అవుతున్నది అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీనంగా ఉండే కుటుంబాలకు కార్పొరేట్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యాశాఖ అనుమతి లేకున్నా అడ్మిషన్లు : ఏబీవీపీ

పెద్దపల్లిలోని ఐదు అంతస్తుల బిల్డింగ్ లో ఓ కార్పొరేట్ విద్యా సంస్థ పాఠశాలను ఏర్పాటు చేసిందని, దీనిని స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారని ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆరోపిస్తున్నారు. బయట ఐడి యల్ పేరుతో పాఠశాలను ప్రారంభించారని పేర్కొంటున్నారు. అయితే పాఠశాలలో చేరే విద్యార్థుల నుంచి అడ్మి షన్లు మాత్రం లక్ష్య ఇంటర్నే షనల్ పేరు తో తీసుకుంటున్నారని ఆరోపించారు. లక్ష్య ఇంటర్నేషనల్, బచ్‌పన్, లిటిల్ క్రియే షన్స్ స్కూళ్లకు ఎలాంటి అనుమతిలేవని, ఈ విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్పించొద్దని పెద్దపల్లి డీఈవో మాధవి గత ఏప్రిల్ 22న ఓ ప్రకటన విడుదల చేశారని గుర్తు చేస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు లక్ష్య స్కూల్‌ను ప్రారంభించడం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శిస్తున్నారు. దీని పై కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. లక్ష్య స్కూల్ యాజమాన్యం బౌన్సర్లను అడ్డుపెట్టుకొని అడ్మిషన్లు తీసుకోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయమై పెద్దపల్లి డీఈవో మాధవిని 'శెనార్తి మీడియా' పలు మార్లు ఫోన్ లో సంప్రదించగా ఆమె స్పందించడం లేదు.

# జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యక్ష పోరాటం




- దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి..
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షు మామిడి సోమయ్య.

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం తగదని, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాలలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభల సన్నాహక సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జన చైతన్య యాత్ర చేస్తామని ఆయన ప్రకటించారు. సమస్యలపై సమిష్టి పోరాటానికి జర్నలిస్టులు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మెజారిటీ జర్నలిస్టుల జీవన స్థితిగతులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా మండలస్థాయి విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని ఆయన విమర్శించారు. జర్నలిస్టులందరికీ ఉపయోగపడాల్సిన మీడియా అకాడమీని యూనియన్ సంస్థగా మార్చి తమ స్వప్రయోజనాల కోసం జేబు సంస్థగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఏం ఒరిగిందని, ఏం మేలు చేశారని గత పాలకులు, జర్నలిస్టు సంఘాలు సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకున్నట్టు జర్నలిస్టుల పేరు చెప్పి అధికార పదవులు పొంది పాలకులకు ఊడిగం చేస్తూ జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి జర్నలిస్టు సంఘాల పట్ల యావత్ జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అర్హత ఉన్న అన్ని చిన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఇతర సంఘాల నుంచి పెద్దఎత్తున టీడబ్ల్యూజేఎఫ్ లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మూడు మాసాల్లో అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఫెడరేషన్ సభ్యత్వం తీసుకున్నారు. సీనియర్ జర్నలిస్టు మిట్టపెల్లి మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సన్నాహక కమిటీ ఏర్పాటు..**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) మంచిర్యాల జిల్లా సన్నాహక కమిటీ ఏర్పడింది. ఎనిమిది మందితో ఏర్పడిన ఈ కమిటీకి కన్వీనర్ గా మిట్టపెల్లి మధు(సూర్య), కో-కన్వీనర్లుగా సత్యగౌడ్(నేటిధాత్రి), కె.వెంకటస్వామి (ప్రజా పాలన), కె.రవి (దిశ), సభ్యులుగా ఎం. భీమయ్య(సూర్య), సుమన్(హెచ్ ఎం టీవీ), ఎం.రాజు(95టీవీ), కె.శ్రీనివాస్ (సూర్య) తదితరులున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు పూర్తి చేసి ఈ నెలాఖరులో జిల్లా మహాసభ జరపాలని సమావేశం తీర్మానించింది.



# అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**శెనార్తి మీడియా, రామడుగు:** రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999– 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 36 మంది ఆదివారం ఒకే వేదికగా కలిశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో మంచిమార్గంలో నడవడానికి మార్గం చూపిన నాటి ఉపాధ్యాయులు వెంకటయ్య, సత్యనారాయణ, రామచంద్రం, మోహన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

# క్రికెట్ పోటీల విజేత కన్నాపూర్ టీమ్



**శెనార్తి మీడియా,శంకరపట్నం :**

వీణవంక మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గెల్లు ప్రదీప్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ ఫైనల్లో కన్నాపూర్, కేశవపట్నం టీం ఫైనల్ కు చేరుకున్నాయి. కేశవపట్నం టీం పై కన్నాపూర్ టీం ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య చేతుల మీదుగా గెల్లు ప్రదీప్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ కప్ కన్నాపూర్ క్రికెట్ క్రీడాకారులు అందుకున్నారు. కన్నాపూర్ క్రికెట్ క్రీడాకారులను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో గెల్లు రాకేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో తొలి షటిల్ ఛాంపియన్‌షిప్

**జిల్లా స్థాయిలో తొలి షటిల్ ఛాంపియన్‌షిప్**

**శెనార్తి మీడియా, జగిత్యాల :** జగిత్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత తొలిసారిగా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి. రామకృష్ణారావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ షటిల్ బ్యాడ్మింటన్ స్టేట్ ఛాంపియన్ షిప్–2025 కోసం క్రీడాకారులను ఎంపిక చేయడం లక్ష్యంగా జిల్లా లో తొలి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌ను ఈ నెల 14, 15 తేదీల్లో జగిత్యాల క్లబ్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని పేర్కొ న్నారు.ఇది జిల్లాలో తొలి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీ కా వడంతో విద్యార్థులు, క్రీడాకారులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. రామ్మోహనరావు, ఉపాధ్యక్షులు పి. శ్రీనివాస్, జాయింట్ సెక్ర టరీ జి. వెంకటరమణ, కోశాధికారి సిహెచ్. మహేందర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు విజయ్, వి. కిషోర్ కుమార్, డి. మహేష్, ఎస్. నవీన్ కుమార్ పాల్గొన్నారు.



# బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలోనీ మంచిర్యాల క్లబ్ లో స్టార్ మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా అతిథిగా ఎస్ టి పి పి డీజీఎం పంతులు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ మీనా రెడ్డిలు హాజరై బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారులు క్రమ శిక్షణతో పాటు చదువు, ఆటలలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన బాడ్మింటన్ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ఆటను కొనసాగించాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. బ్యాడ్మింటన్ క్రీడ పోటీలకు సహకరించిన మంచిర్యాల క్లబ్ కమిటీ వాళ్లకు, స్వరూప హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు సుమారు వందమందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 బాల బాలికలకు, మెన్ అండ్ ఉమెన్ , మాస్టర్స్ 35 ప్లస్ నుండి 75 ప్లస్ వరకు క్రీడాకారులు హాజరైనట్టు తెలియజేశారు. జిల్లా ఛాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, కృష్ణ, రవి, మధు, శ్రీనివాస్ రెడ్డి, నంద శ్రీనివాస్, మహేష్, మురళి, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజా వాణి రద్దు

**శెనార్తి మీడియా, జగిత్యాల :** జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావొద్దని విజ్ఞప్తి చేశారు.భూ భారతి అవగాహన సదస్సులు జిల్లాలోని అన్ని మండలల్లో నిర్వహిస్తున్నందున అధికారులు భూ భారతి అవగాహన సదస్సులలో పాల్గొనడం వల్ల ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.

# ప్రజల మనిషి మునీర్

- సంస్మరణ సభలో టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజా సమస్యలను నాయకులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ ఎప్పుడూ ముందుండేవారని, ఆయన పీడిత ప్రజల కోసం పరి తపించిన మనిషి అని టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎండి మునీర్ సంస్మరణ సభను ఆదివారం బస్టాండు సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుతో కలిసి మాట్లాడారు. ఎండీ మునీర్ ఉద్యమకారుడిగా, జర్నలిస్టుగానే కాకుండా ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారని మునీరుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్న నాటి నుంచే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే వారని, పీడిత అణగారిన వర్గాల ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సింగరేణి ఉద్యోగిగా, జర్నలిస్టుగా పనిచేస్తూ బొగ్గు బావుల్లో సమస్యలను ఏకరువు పెట్టి పరిష్కరించడంలో ముందుండేవారన్నారు. తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మెలో 55 రోజుల పాటు సింగరేణి కార్మిక సమ్మెకు జేఏసీ చైర్మన్‌గా మునీర్ వ్యవహరించి కార్మిక సంఘాలను, కార్మికులను, అధికారులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమానికి అండగా నిలిచారన్నారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదన్నారు. భౌతికంగా మన మధ్య లేకున్నా సింగరేణి ఉన్నంత వరకు మునీర్ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్ 143 నాయకులు మారుతి సాగర్, యోగానంద్, ఇఫ్టూ జాతీయ నాయకులు టి శ్రీనివాస్, పీవోడబ్ల్యూ నాయకురాలు మంగా, న్యూ డెమోక్రసీ నాయకుడు లాల్ కుమార్, యూనియన్ జిల్లా కన్వీనర్ ఉమేష్, కో కన్వీనర్లు రమేష్, శ్రీనివాస్, మునీర్ సోదరుడు సందాని, కుమారుడు మయూర్ తదితరులు పాల్గొన్నారు.